# ఆ యిల్లు

కొత్తగా ప్లీడరీ ప్రాక్టీసు పెట్టబోతున్న మా బావమరది రెండురోజులు ఊరంతా తిరిగి, ఇల్లు తన మనస్సులో నిశ్చయం చేసుకునివచ్చి నన్ను ముందుగా ఒక పర్యాయం చూడమన్నాడు.

ఇంకా మేము వీధి చివరనే ఉండగా "చూశావుకదూ, ఆ పచ్చ మేడకి ఎదురుగావున్న ఎత్తరుగుల పెంకుటిల్లు అదే" అన్నాడు.

"అదేనా, అదయితే మరి నేను చూడనక్కరలేదు. నువ్వు ఈ ఊళ్ళో ఉన్నంతకాలంలోనూ, ఎన్నడయినా నేను నీ ఇంటికి రావాలంటే, మరొక అయిదు రూపాయలు ఎక్కువయినాసరే వేరే ఇల్లు తీసుకో అని వెనక్కి తిరిగాను.

మా వాడికి కష్టం తోచిఉంటుంది. "నీ కా ఇల్లు తెలుసునేమిటి ?" అని నా సమాధానంకోసం ఆగకుండానే "అయినా నువ్వెప్పుడో చూసి వుంటావు. ఈ మధ్యనే మరమ్మత్తులూ అవీ చేయించారు. అదివరకు రెండు మూడు చిన్న చిన్న కుటుంబాలుండేవిట; ఇప్పుడు మన ఒక్కరికే ముప్పై అయిదు రూపాయలకి ఇచ్చేస్తున్నా"రంటూ అయిష్టంగా తను వెనక్కి తిరిగాడు.

నాకు మరి వాడు చెప్పే మాటలు ఏవీ వినిపించుకోవాలని లేదు. "నీకు ఇంకొక ఇల్లు వెతుక్కోడానికి కష్టంగావుంటే, నాలుగు రోజులు నా పని మానుకుని అయినాసరే, తిరిగి ఏదో ఒకటి కుదిర్చి పెడతానులే, అంతేకాని మరి ఈ ఇంటి సంగతి మాత్రం చెప్పకు" అన్నాను.

మా వాడూ తక్కువవాడు కాడు. "పోనీ ఒక్కమారు ఆ ఇల్లంతా చూడకూడదా" అన్నాడు. ఆఖరి ప్రయత్నంగా నేను ఆ ఇంటిమీద అకారణంగా అపోహ పెట్టుకున్నానేమోనని.

నాకు మరి ఆ విధంగా రోడ్డు మధ్యకి నిలబడి చర్చ చేయడం చికాకనిపించింది. "నువ్వు వెయ్యి చెప్పు, లక్ష చెప్పు, ఆ ఇంట్లో నువ్వు ఉండే

మాటయితే నేను రావడం మాత్రం జరగదు. అందుకు సాకూ తగిన కారణం లేకపోలేదు. కావాలంటే, పోయి ఇంటి దగ్గర చెప్పుకొందాము" అన్నాను.

మేము ఇంటికి వెళ్ళి వెళ్ళడంతోనే మా ఆవిడ వాళ్ళ అన్నయ్యను అడిగింది "ఏమిటి చేసుకుని వచ్చారు ? మీ బావగారికి నచ్చిందా" అనీ టీ మరుగుతున్న నీళ్ళలో వేస్తూ.

నిస్పృహగా కుర్చీలో కూలబడుతూ "ఉఁ హుఁ మళ్ళీ మొదటికి వచ్చింద"న్నాడు మా బావమరిది.

ఆవిడ కుర్చీలో కూర్చుని ఉంది. "నాకు మొదటే తెలుసును ఆయనకి నచ్చదని. వైద్యుణ్ణి కూరలు కొనడానికి పంపిస్తే, ఏ కూరా నచ్చక చివరికి తిప్పతీగ కొనుక్కొని వచ్చాడట. ఆ విధంగా ఆయనకి ఏ ఇల్లూ నచ్చదు. తానంటే ఇప్పటికి ఏదో ఇల్లు కట్టించుకున్నారు గనక, ఇక అందరి ఇళ్ళూ ఆ మాత్రంగానైనా ఉండకపోతే వీల్లేదంటారు. అసలు ఇప్పుడు ప్రజలకి వస్తున్న జబ్బులలో నూటికి తొంభై వంతులు గాలీ వెల్తురూ సరిగా రాని ఇరకాటపు ఇళ్ళ మూలంగానే వస్తున్నాయట."

"అంత అందరూ మంచి ఇళ్ళలో పరిశుభ్రంగా ఆరోగ్యంగా ఉంటే, మరి ఈ డాక్టర్ల అవసరమే ఉండదు" అన్నాడు మా బావమరిది.

"అవునయ్యా ! అదే నేను కావాలనేది. ప్రజలకు జబ్బులు లేకుండా ఉంటే నా అవసరం ఉండదు. అయితే అటువంటి స్థితి ప్రపంచంలో ముఖ్యంగా మన దేశంలో ఎప్పుడు వస్తుందో, అసలు రానే రాదు..."

ఇంకా నా మాట పూర్తికాకుండానే లేచి టీ కలుపుతూ ఆవిడ ప్రపంచంమాట దేముడెరుగు, ముందు ఇంటి సంగతి చెప్పండురూ" అన్నది.

"చెప్పడానికేముంది, నాకా ఇల్లు నచ్చలేదు" అన్నాడు.

"ఎందుచేత నచ్చలేదో, కొళాయీ, నుయ్యి కూడా ఉన్నాయట. ఎలక్ట్రిసిటీ ఉందట. ముందు పెద్ద హాలుందట. పూర్వకాలపు ఇల్లయినా కొత్తగా మరమ్మత్తులు చేయించారట."

ఇంతలో మా బావమరది "అసలు ఇల్లంటూ చూస్తేకదూ, వీధి చివర నుండి ఫలానా ఇల్లు అని చూపించడమే నాది పొరపాటు" అన్నాడు.

ఆవిడ పెదవి విరిచి, "అయితే ఇంతా ఇల్లు చూడకుండానేనా ?" అన్నది.

నాకు మరి ఊరుకోబట్టిందికాదు. "నీకూ మీ అన్నయ్యకీ అంతగా ఆ ఇల్లే కావాలనుంటే వద్దనడానికి మధ్య నే నెవర్ని. కేవలం, తరవాత నా మీద నిష్ఠూరం వెయ్యకుండా ఉండటానికి. నేను మాత్రం ఆ ఇంటికి రానే నన్నాను. అంతే. నా కారణాలు నాకూ ఉన్నై" అన్నాను.

"అవునవును. అవేమిటో ఇంటిదగ్గర చెప్తానన్నావు" అన్నాడు మా బావమరిది అప్పుడే నిద్రనుండి లేచినట్లుగా.

"నేను చెప్పాలనే అనుకుంటూవుంటే మీరిద్దరూ భళాభళి అని ఒకరి తర్వాత ఒకరు మాట్లాడుతూ నాకేమయినా సావకాశం అంటూ ఇస్తేకదూ" అన్నాను.

అప్పటికి కొంచెం సర్దుబాటు మార్గానికి వచ్చి మా బావమరిది "మరి నేనూ మా చెల్లెమ్మా ఏమీ మాట్లాడం, ఆ చెప్పేదేదో ఇప్పుడు చెప్తావా?" అన్నాడు.

"నేనేం చెప్పననడం లేదు. పద తోటలోపోయి కూర్చుందాము. అక్కడికే శారద టీ తెచ్చేస్తుంది" అన్నాను.

టీ తీసుకొన్నాక "శారదా! నీతో రెండుమూడు మార్లు లోగడ చెప్పాలనుకొనికూడా చెప్పడం కాలేదు. నువ్వూ కూర్చో వింటువు గాని" అన్నాను.

ఆమె "అంతకంటేనా, ఒక్క క్షణం ఆగండి. నా అల్లిక తెచ్చుకొని వస్తా" నంది.

ఆలోపున నేను సిగరెట్టు ముట్టించి, కొద్దిగా కాల్చి, మధ్యలో అడ్డంకిగా ఉండకుండా పారేసి, పడకకుర్చీలో వెనక్కి చేరబడి చెప్పడం మొదలు పెట్టాను. చెప్పడం మొదలుపెట్టిన తర్వాత నాకళ్ళు తెరిచిఉన్నాయో మూసుకుని ఉన్నాయో తెలుసుకోవడం ఇప్పుడు నాకూ కష్టమే. కాని, నాకు కనిపించినవి మాత్రం ఎట్ట ఎదురుగావున్న చెట్లకొన కొమ్మలూ ఎగిరే పక్షులూ కాదన్నది మాత్రం నిర్వివాదాంశం.

* * * * *

నేను నా పదిహేనవయేట స్కూలుఫయినలు ప్యాసయాను. అంతే వరకూ మా చిన్నాన్నగారి ఊళ్ళోనే గడిచిపోయింది. అప్పుడు ఇంట్నుండి

యేటుకు ఈ ఊరు వచ్చాను. అప్పుడు నా బస ఎక్కడో తెలుసునా, ఇందాక నువ్వు చూసిన ఆ ఇంట్లోనే.

ఊఁహుఁ మరి నువ్వేమీ మాట్లాడకు నన్ను సాంతం చెప్పనీ.

అప్పుడు నేను నా వయస్సుకీ తగినంత ఒడ్డు పొడవులతో ఉండేవాణ్ణి కాను. అందరూ నా నిజమయిన వయస్సుకి రెండేళ్ళు తక్కువగానే ఊహించే వారు. ఒక్క ఒడ్డు పొడవుల్లోనే కాదు. తక్కిన విషయాల్లో కూడా నా యీడు విద్యార్థులకంటె చాలా వెనకబడి ఉండేవాణ్ణి. ఒక్క స్కూల్ మార్కులలో తప్ప. వాటిలోనూ మొదటి మార్కులు ఎప్పుడూ లేవుగాని, మొట్టమొదటి ముగ్గురు నలుగురు విద్యార్థులలోనూ లెక్కకి వచ్చేవాణ్ణి కాక, మరీ చిన్నవాడులాగా కనిపించడంమూలాన కూడా. లెక్చరర్లకీ తోటి విద్యార్థులకీ నేనంటే చాలా అభిమానం.

ఇంటికి వెనకభాగంలో ఒక డాబా. అందిమీద పిచ్చిక గూడులాగా ఒక చిన్న గది. అది నా గది. దానికి నెలకి మూడు రూపాయలు అద్దె ఇచ్చే వాడిని. 'ఆ మూల సౌధంబుదాపల అన్నట్లు అన్ని వరండాలూ ద్వారాలూ దాటుకుని ఆ లోపలికి ఎవడు వెళ్తాడయ్యా' ఉండేవారు ఉన్న కొద్దిమంది స్నేహితులున్నూ. నాకు కావలసిందీ అదే. కాక అప్పుడు నా కింకొక గర్వ ముండేది. నా స్నేహితులు పేర్లుకూడా విననివి ఎన్నెన్నో పుస్తకాలు చదివేను. అప్పటికి కాలేజీ లైబ్రరీలోనూ, మ్యునిసిపల్ లైబ్రరీలోనూ ఉన్న ఇంగ్లీషు నవలలలో నేను చదవనది ఒక్కటి లేదు.

ఈ నా ఎల్లప్పుడూ చదువుకునే అలవాటువల్ల నయితే నేమి. అదివర కుండే కుర్రవాళ్ళలాగా నా గురించి పదిమంది స్నేహితులు వచ్చి గోల చెయ్యకపోవడంవల్లనయితే నేమి, నే నయినా ఎంతో మంచి ఫిలిమయితే మొదటి ఆటకి వెళ్ళడం తప్ప, మామూలు విద్యార్థులలాగా తరుచు రెండవ ఆటకి వెళ్ళి నడిరాత్రప్పుడు తలుపు తెరవమని గోల చెయ్యకపోవడంవల్ల నయితేనేమి, మొత్తంమీద ఆ ఇంటిలోవుండే మూడు కుటుంబాలవారికీ నే నంటే చాలా అభిమానంగానూ, గౌరవంగానూ కూడా ఉండేది. తరచు వాళ్ళ వాళ్ళ పిల్లలకి బుద్ధిచెప్పే సందర్భాలలో, నన్నొక ఆదర్శ విద్యార్థిగా లెక్కించి, "చూడు మేడమీద భూషణం ఎప్పుడు భోజనానికి వెళ్తాడో, ఎప్పుడు వస్తాడో, కాలేజీవున్న రోజుల్లో తిన్నగా కాలేజీకి వెళ్ళి వస్తాడు.

అంతే. అలా తన మానాన తను కూర్చొని చదువుకుంటాడు. అదీ బాగుపడే వాళ్ల లక్షణం" అంటూ ఉండేవారు.

ఇదంతా ఎందుకు చెప్పవలసి వస్తున్నాదంటే, నేను అది మొదలుపెట్టి నా కథ చెప్తుంటే అప్పుడూ ఇప్పుడూ ఒక్క లాగే ఉన్నాననుకుంటారేమో నని. నిజానికి అప్పటి నా శక్తినీ, ఒంటరితనాన్నీ తలుచుకుంటూ ఉంటే, ఇప్పుడు నాకు చికాకుగానే ఉంటుంది. సరే ఏదయితేనేం. జరిగినదేదో ఫలానా రకంగా జరిగిందని చెప్పుకోవడంకంటె మనం చేయగలిగింది ఏమీ లేదు.

అట్టే డొంకతిరుగుడు లేకుండా అసలు విషయానికే వస్తున్నాను.

అవతల తాను ఎన్ని ఇబ్బందులుపడి అయినాసరే, మా చిన్నాన్న నాకు పుష్కలంగానే డబ్బు పంపించేవాడు అంటే ఒకటి, కాలేజీ జీతమూ, హోటలుకి ఇవ్వవలసినదీ కాక, ఎక్కువ ఎంత అయినా నాకు ఎక్కువ అన్నట్లుగానే ఉండేది. ఆ ఇంటిలోని ముగ్గురు గృహస్థులూ అప్పుడప్పుడు నా దగ్గర రెండూ, మూడూ, అయిదూ చొప్పున పదిలోపుగా వాడుకుంటూ ఉండడమూ, మళ్ళీ వీలునుబట్టి తీర్చేస్తూ ఉండడమూ కూడా అంత అరుదైన సంగతి కాదు.

అప్పుడు ఇంటర్మీడియేటు పరీక్షకి డబ్బు కట్టవలసిన రోజులు. పరీక్ష డబ్బూ, కాలేజీకి కట్టవలసిన జీతమూ, సైన్సు లేబరేటరీలో నా చేత పగిలిన రెండు మూడు వస్తువుల ఖరీదూ, రైలులో పోయిన ఒక లైబ్రరీ పుస్తకం ఖరీదూ, అంతా మొత్తం అరవై ఎనిమిది రూపాయలు కట్టవలసి వచ్చింది. అదివరకు ఎప్పుడో మా చిన్నాన్న పంపిన బాపతు నా దగ్గర మిగిలి ఉన్నది ఇరవై రెండు రూపాయలు.

మా చిన్నాన్న దగ్గరనుండి, ఉత్తరం డబ్బూ రానన్నాళ్ళూ, ఇంకా రేపు వస్తుంది ఇవాళ వస్తుంది అని ఎదురు చూసేవాణ్ణి ఎందుకయినా మంచిదని రెండు రోజులకొక ఉత్తరం రాసి పడేస్తూ చివరికి మామూలు తేదీయే కాక, ఫైనుతో యూనివర్సిటీకి డబ్బు కట్టవలసిన రోజు కూడా సమీపించింది. మరి ఆలస్యం చెయ్యడానికి వీలులేదు. నా వైరు అందడమే తడవుగా టెలి గ్రాము మనియార్డరు వస్తుందనుకున్నాను. కాని, నేను పోస్టాఫీసునుండి ఇంటికి వచ్చేసరికి అంతకు మూడు రోజులక్రితం మా పొరుగింటాయన రాసిన

ఉత్తరం వచ్చి ఉంది. మా చిన్నాన్న బ్రహ్మాండమయిన జబ్బుతో, ఏమిటో వివరాలు లేవు. బాధపడుతున్నాడనీ, అంతకాలం నేను గాభరా పడతానేమో నని తెలియచేయవద్దన్నాడనీ, ప్రస్తుతం ఎక్కడలేని డబ్బూ ఆయన మందు ఖర్చులకీ డాక్టర్ల రాకపోకలకీ చాలటంలేదనీ, ఒక వారం పది రోజులు గడువిమ్మని కోరవలసిందనీ, లేదా నేనే ఏదో విధంగా సర్దుబాటు చేసుకోవలసిందనీ ఆ ఉత్తరం సారాంశం.

నాకు విచారమూ, ఆశ్చర్యమూ, నవ్వు అన్నీ కలిగాయి ఆ ఉత్తరం చూడడంతోనే.

ఏమిటి చెయ్యడం? అక్కడికి వెళ్ళి చెయ్యగలిగింది లేశమాత్రమూ లేదు. కాక, ముందు ఆ డబ్బంటూ ఏదో విధంగా కట్టేస్తే, తరువాత అక్కడికి వెళ్ళి ఒక నాలుగు రోజులుండి అక్కడే చదువుకుంటూవున్నా బాధ లేదు అనిపించింది.

ఇంటిలో నా దగ్గిర చిల్లర మల్లర అప్పులు తీసుకున్న గృహస్థులు తీర్చివుంటే మరొక ఇరవైనాలుగు రూపాయలు చేరి ఉండేవి. కాని అదేమి ఖర్మమో వేళకి అందరూ ;అతి విచారాన్ని సూచించేవారేకాని, ఒక్కరూ ఒక్క దమ్మిడీ అయినా ఇవ్వలేదు. మరొక్కవారం రోజులుపోతే వంద రూపాయలయినా ఇవ్వగలనని ఒకాయనా, అయ్యయ్యో నిన్నకాదు మొన్ననే ఒకరికి డెబ్భైరూపాయలు ఇచ్చేశాను. అప్పుడే తెలిసివుంటే ఎంతబాగుండునని ఒకాయనా, ఏం, ఉంటే నీకేం ఉచితార్థం ఇవ్వాలా అని ఇంకొక ఆయన ఇలా ఏదో ఒక పద్ధతిని అందరూ అన్ని కారణాలు చెప్పారు. నిజమే అయుండవచ్చును వాళ్ళ కారణాలు. కాని, నాకు మాత్రం వాళ్ళంతా కక్ష కట్టి ఏదో ఘోరమైన అన్యాయం చేస్తున్నట్లు కనుపించారు అప్పటి ఉడుకుబోతు తనంలో.

ఎవరినయినా తోడి విద్యార్థుల నడగడం ఒక్కటే మిగిలివుంది. కాని, అందరికీ అవసరమయిన సమయమే. కాకపోయినా అంత డబ్బు ఒక్కమారు ఎవరియ్యగలరు. అయినా మూడు నాలుగు చొప్పునయినా అడిగి, సేకరించాలనిపించింది లీలగా మనస్సులో. కాని, ఎంచేతో ఆ సాయంత్రం ఆ పనిమీద కదలలేకపోయాడు.

ఏమిటి ఆలోచిస్తున్నానో నాకే నిశ్చయంగా తెలియకుండా డాబా మీద పడక కుర్చీలో పడుకున్నాను. రాత్రి హోటలుకి భోజనానికి వెళ్ళాలన్న విషయమే స్ఫురణకి రాలేదు. ఎప్పుడు నిద్రపట్టిందో కూడా తెలీదు.

ఆ నాటి నిద్రలో కలలు వచ్చాయో లేదో చెప్పలేనుకాని, మెలకువ వచ్చిన తరువాత కనిపించిన దృశ్యమూ, జరిగిన సంఘటనా మాత్రం ఈనాటికి కలలవలెనే కనిపిస్తాయి. కలలయినా అంతటివి ఎప్పుడో తప్ప, తరచుగా వస్తాయనుకోను.

ఆమె మెత్తని చేయి నా చేతిని తగలడంతో మెలుకువ వచ్చింది. అప్పుడు తెల్లవారుఝాము మూడో నాలుగో అయివుంటుందనుకుంటాను. ఎంచేతంటే అది కృష్ణపక్షం; ఆవేళ తిథిదశమి. అల్లంత ఎత్తున వున్న చంద్రవంక వెలుగురేకలు ఆమె మొగంమీద, ముఖ్యంగా కళ్ళలోపడి నా కళ్ళలోకి ప్రతిఫలిస్తున్నాయి. ఆఁ అప్పుడే నిద్రలేచిన ప్రశాంతిలో, ఆమెగాని మాట్లాడకుండా చల్లగా వెళ్ళిపోయివుంటే, మళ్ళీ నేను నిద్రలో మునిగి రాత్రి కలలో ఎవరో దేవతా మూర్తిని చూసాననుకుని ఉందును.

ఆమె ఎక్కువ మాట్లాడలేదు. "నాకు మా అత్తయ్య తను చచ్చిపోయే ముందు ఎవ్వరికీ తెలియకుండా ఇచ్చింది. ఇందులో నల్భైఅయిదు రూపాయలున్నాయి తీసుకోండి, మీకిప్పు డవసరంగా ఉన్నట్టున్నాయే" అంటూ నా చేతికి ఒక చిన్న బార్లీగుండ డబ్బాను అందించి, "చాలునా?" అన్నది తన చిటికెనవ్రేలినున్న ఉంగరంవంక చూస్తూ.

"చాలునుగాని, ఎందుకూ, మీకు మళ్ళీ తిరిగి ఇవ్వడానికి..."

అంటూండగా ఆమె వారించి "ఇవ్వకపోయినా మరేం బాధలేదు లెండి, నేను వెళతాను. ఎవళ్ళయినా వస్తారు" అంటూ డాబా మెట్లమీంచి దిగినట్లు కాకుండా జర్రున జారినట్లుగా వెళ్ళిపోయింది.

ఆమె ఎలా వచ్చిందో, నన్ను లేపడానికి ముందు ఎంతసేపు అలా నిలబడివుందో తెలియదు. వెళ్ళిపోవడాన్ని ప్రత్యక్షంగానే చూసినా ఏమో అతిలోకస్వాప్నికవృత్తాంతంలాగే తోచింది. అయితే ఆమె నా చేతికి అందించిన డబ్బా మాత్రం ఎటువంటి సందేహానికి తావియ్యలేదు. అందులో ఒక సన్నని సిల్కు గుడ్డతో చుట్టబడి వున్నాయి నోట్లు. వాటిని మరి లెక్కపెట్టాలనిపించలేదు. ఇప్పటికీ, ఆ రూపాయలను కేవలం రూపాయల మానం

లోనే లెక్క కట్టడం ఆమె సౌహార్దానికి పరమ అపచారం చేయడం అని పిస్తుంది.

అంతసేపూ శ్రద్ధగా విన్న మా బావమరది మరి ఉండబట్టక "ముందు ఆమె ఎవరో ఏమిటో మాకు చెప్పకుండా, అలా అల్లుకుని పోతుంటే, మమ్మల్ని ఆమెను ఏ విధంగా అర్థంచేసుకోమన్నట్లు? ఆమె మానవలోకం లోని మామూలు మనిషా? లేక స్వర్గలోకమునుండి వేళకు తిరిగి వచ్చిన దేవతా? లేక, ఊహాలోకంలోని ఊర్వశా? ఎవరనీ నిర్ణయించేదిరా అన్నంత సందేహంలో మమ్మల్ని ఉంచేస్తే ఎలాగ? అసలు కథకుడు కానివాడు పెద్ద ఎత్తున కథ చెప్పడం మొదలు పెడితే వచ్చే అనర్థమే ఇది" అన్నాడు.

మామూలుగా అయితే అటువంటి వాదన సావకాశాన్ని నేను తేలికగా పోనిచ్చేవాణ్ణి కాను. కాని ముందుగా నేను చెప్పే సంగతి పూర్తికాకుండా వాదనలోకి దిగాలనిపించలేదు. "అవునన్నయ్యా, నే నెలాగూ నీలాగ కథకుణ్ణని చెప్పుకోవడంలేదు. కాక ముందుగా ఏది అత్యంత ముఖ్యమయిన విషయం అయితే, దాన్నే పరిశీలించడం మా డాక్టర్ల లక్షణం" అన్నాను.

అంతలో మా ఆవిడ కథ పక్కదారి తొక్కుతున్నదేమోనని అనుమానించి "అయితే తరువాత ఏమిటయింది చెప్పమరూ, అందులోగాని డబ్బు అనుకున్నంతా లేదా ఏమిటి? అన్నది.

అఁహఁ అటువంటిదేం లేదు. అంతా సరిగానే వుంది. కాని, ఆమె ఎవరన్న సంగతికదూ ఇంతవరకు చెప్పలేదు.

ఆ ఇంట్లో ఒక భాగంలో కుటుంబయ్యగారని, ఒక ప్లీడరు గుమాస్తా ఉండేవాడు. వాళ్ళ ప్లీడరు ఆర్జనకంటె ఆయన ఆర్జనే ఎక్కువగా ఉండేదట. కాని, అందులో మూడువంతుల ముప్పాతిక తన వ్యసనాలకే ఖర్చు పెట్టేసేవాడనేవారు. ఆయన ఎటువంటివాడయితేనేం. వాళ్ళ పెద్దమ్మాయి పేరు శాంత. ఆమెను నేను అదివరకు చూడకపోలేదు. కాని, ఆ చూడడం వేరు, ఆ తెల్లవారుజామున చూడటం వేరు.

ఆమె నా కంటె వయస్సులో ఒకటి రెండేళ్ళు చిన్నయి ఉండవచ్చును కాని, పెద్ద అన్నట్లుగానే కనబడేది. నేను అప్పటికి పదహారున్నర వయస్సు వున్నా బాగా పెరగకపోవడం వల్లనూ, ఆమె పరికిణీ వల్లెవాటు కూడా మానేసి చీరలే కట్టుకుంటూ ఉండటంవల్లనూ.

తరవాత కొన్నాళ్ళు ఏమో నాకే తెలియని వింత కదలిక. నా కృతజ్ఞతను ఏ యే రీతుల ఎంత ఉదాత్తంగా ప్రదర్శించాలీ అన్న ఆలోచనతో ఎన్ని పగటి కలలు కన్నానో లెక్క లేదు.

ఎల్లప్పుడూ ఆమెను చూడాలనే ఉండేది, మాట్లాడ్డం ఎలాగూ సాధ్యం కాదు గనక. కాక మే మిద్దరమూ తారసపడినప్పుడు దగ్గర ఎవ్వరూ లేక పోయినా సరే, నిబ్బరంగా ఆమె కళ్ళల్లోకి చూడడానికి సాహసం చాలేది కాదు.

తరువాత మా చిన్నాన్న తేరుకుని డబ్బు పంపేవేళకు ఆమె అత్తవారింటికి వెళ్ళిపోయింది. ఇప్పుడంటే ఇంత తేలిక గా అనేస్తున్నానుగాని, అప్పుడు ఎవర్నీ అడగకుండా ఆ విషయం తెలుసుకునేందుకు ఎంత అవస్థపడ్డానో, తెలుసుకున్న తరువాత, అరకే ఆమెకు నా కృతజ్ఞతను తెలుపలేకపోవడమే కాదు, అధమం ఋణం అయినా తీర్చుకోలేకపోయానే అని ఎంత తపించానో ఇప్పుడు నాకూ సరిగా ఊహకు అందదు. అప్పుడదొక జీవితంలోని అతి ముఖ్యమయిన సమస్య.

తరువాత నాకు ఉన్న అతి అమూల్యమయిన వస్తువులలో ఒకటి అన్నంత భద్రంగా ఆ డబ్బాను నా పెట్టెలో దాచి ఉంచేవాణ్ణి. ఒకమారు నా బట్టలు అవీ సర్దడంలో ఈవిడే (శారద) తీసిపారేసిందట. ఆవేళే చెప్పాలనుకున్నాను కాని, అవతల ఏదో తొందర కేసు ఉండి వెళ్ళిపోవలసివచ్చింది.

ఆ వెనుక అదివరకు ఏడెనిమిది సంవత్సరాలుగా సాగిన దావా మా చిన్నాన్నకి చాలా అనుకూలంగా పరిష్కారం కావడంతో నేను హుషారుగా యమ్. బి. బి. యస్. చదువుకునేందుకు వెళ్ళిపోడానికి వీలుకలిగింది.

చదువు సాంతమయిన తరువాత ఈ ఊళ్ళోనే ప్రాక్టీసు పెట్టాను.

ఆరంభించి అప్పటికి ఒక పది నెలలుకంటె ఎక్కువకాలేదు ప్రాక్టీసు ఏదో ఒక మాదిరిగా ఉంటున్నా అంత మరీ ప్రోత్సాహకరంగా లేదు. తీరిక గంటలంటూ ఉండేవి.

ఆరోజు పూర్ణిమ. అప్పుడే ఉదయించిన చంద్రబింబం చెట్ల మాటు నుండి, ఇంకా ఎరుపు ధాతువుతోనే కనిపిస్తున్నది. ఒంటరిగా డాబామీద కూర్చుని, ప్రపంచం గురించి, సంఘం గురించి కలగాపులగంగా ఆలోచిస్తున్నాను.

అంతలో క్రిందనుంచి పిలుపు వినవచ్చింది. నౌకరు కుఱ్ఱవాడితో మేడమీదకు తీసుకుని రమ్మన్నాను. వచ్చిన మనిషి కుటుంబయ్యగారే; చూపిన కుర్చీమీద కూర్చోకుండానే దండకం చదివినట్లుగా అందుకున్నాడు. "అప్పుడు తమరు మేమున్న ఇంట్లోనే ఉండి చదువుకుని, ఇంతవారవడం చాలా సంతోషం. తమ దర్శనం చెయ్యాలనుకుంటూ ఉండటం ఎప్పటికప్పుడే తీరిక లేకపోతూ ఉండడమున్నూ. మరి కూర్చునేందుకు నాకు వీలులేదు. మా శాంతమ్మకి ఒళ్ళెరగని జ్వరం. నాలుగయిదు రోజులు అదే పోతుందని ఊరుకున్నాము. తరువాత కొయిను (క్వైనైను) మాత్రలు వేసినా తగ్గలేదు. ఏమిటో భయంగా ఉంది బాబూ, ఇంతవరకూ జ్వరం తిరుగు ముఖానికి రాలేదు. తమరు ఒక్కమారు దయచేస్తే" అన్నాడు.

ఈ మాటలు వినడంతో అతనికంటె నాకే తొందర ఎక్కువయింది. ఏ మాత్రమయినా ఉపయోగిస్తాయని తోచిన మందులన్నీ పట్టుకుని, జట్కాలో బయలుదేరేము.

జబ్బు గురించిన లక్షణాలే దారిపొడుగునా కుటుంబరావుగారిని అడిగాడు. ఆయనా అవే చెప్పాడు అంతే. కాని, వెళ్ళి ఆమె మంచం ప్రక్కన కుర్చీలో కూర్చునేవరకూ ఆమె వితంతువు అన్న సంగతి తెలియదు. డాక్టరుగా నాకనవసరమయిన అంశంమీద నా మనస్సు లగ్నం కావడం నాకే చిన్నతనంగా తోచింది. ఎవరయితేనేం, ఆమెకు నేను ఋణపడి ఉన్నాను. నా చేతనయినంతగా పరిశ్రమించి ఆమెకు ఆరోగ్యం చేకూర్చడం నా విధి అనుకుని పరీక్ష ప్రారంభించాను. కుటుంబయ్యగారు చెప్పినంత ప్రమాదంగా కాకపోయినా, జ్వరం చాలా ఎక్కువగానే వుంది. టైఫాయిడనటానికి ఏమీ సందేహంలేదు. కాని, బైటివాళ్ళు చెప్పే మాటలు లీలగా అర్థం అవుతున్నాయి.

నేను నా పరీక్ష ముగించి ధర్మామీటరూ చేతులూ కడుక్కోడానికి నడివాకిలిలోకి వచ్చాను.

ఎదురుగా డాబా కనిపించింది. ఊఁహుఁ, కనిపించింది డాబామాత్రమే కాదు, ఆ వెన్నెలలో పడకకుర్చీలో నేను పడుకుని ఉండటమూ, ఆమె ఎట్ట ఎదురుగా దేవతామూర్తివలె నిలబడి వుండటమూ, అతి స్పష్టంగా కనిపించింది. ఆహా ఆ దివ్య సౌందర్యానికీ, ఈ మంచంమీద దుర్బలంగా పడివున్న

ఆకృతికీ ఏమి సంబంధం ? ఒక్క ఆరు సంవత్సరాలులో అంత మార్పు రావటానికి వీలుందని ఎవళ్ళయినా అంటే, నా కళ్ళతో నేను చూడకపోతే నమ్మలేకపోయేవాడిని అనుకున్నాను.

నన్ను పిలవడంతో కుటుంబయ్యగారి పని చాలా తేలికపడి ఉంటుంది. ఏమంటే వాళ్ళందరూ తీసుకోవలసిన శ్రద్ధ అంతా నేనే తీసుకుంటూ, ఇదేదో నేను డబ్బు పుచ్చుకుని కుదర్చవలసిన జబ్బు అని కాక, నాకే సంబంధించిన జీవన మరణ సమస్య అన్నట్లుగా తాపత్రయపడ సాగాను. కుటుంబయ్యగారూ వాళ్ళూ ఏమో ప్రాక్టీసు బాగా లేదు కాబోలు. అంచేత గట్టిగా శాయశక్తులా పని చేసి ఒకటి రెండు చోట్ల నయం చేస్తే, పేరువస్తుందని పని చేస్తున్నానని నా విపరీతమయిన శ్రద్ధకు అర్థం చెప్పుకుని ఉంటారు. కాని, ఆ సందర్భంలో మాత్రం, పేరు రాకపోతే మానిపోయేను. అపకీర్తి వచ్చినా బాధ లేదు. ఆరోగ్యం చేకూరితే అంతే చాలుననిపించింది. అందుకు మనం శాస్త్రీయంగానూ, సామాన్య దృష్టితోనూ ఎన్నెన్నో కారణాలు చెప్పుకోవచ్చును గాని, అసలు పరిస్థితి మాత్రం అది.

మరేం ప్రమాదకరమైన లక్షణాలు లేవు, నేనే నయం చేయగలనన్న నమ్మకం ఉండినప్పటికీ, ఏమో నేను పొరపడుతున్నానేమో. ఇటువంటి సందర్భాలలో నా అహంభావం కోసం పాకులాడడం మంచిది కాదని అప్పటిలో ఊరంతటికీ ప్రసిద్ధుడయిన డాక్టరు శ్యామలరావుగారిని నా అంతట నేను తీసుకుని వెళ్ళాను.

నా కయితే ఎంత స్వల్పంగానయినా కట్నం ముట్టచెప్పి, తక్కినదంతా కృతజ్ఞతా వాక్యాల రూపేణ చెల్లించవచ్చు నన్న కుటుంబయ్యగారికి, డాక్టరు శ్యామలరావుగారి రాక ఒక విధంగా ఇష్టమే అయినా ఇంకొక విధంగా గాభరాకి కారణమయింది. కాని, ఆయనను అట్టే సేపు ఆ స్థితిలో ఉండనుండా, "డాక్టరుగారి బిల్లు సంగతి మీకేం పూచీ లేదు. అదంతా నేను స్వయంగా చూసుకుంటాను. అంటే, అసలు, ఇటువంటి సందర్భంలో మేమిదివరకు చదివి చదివి ఎంత తెలుసుకున్నా వారి అనుభవం నుండి నేర్చుకోవలసినవి కూడా చాలా సంగతులుంటాయి. అందుకోసమే ఆయనను తీసుకుని వచ్చాను. అయినా, నేను అభిప్రాయపడ్డట్టే అభిప్రాయపడుతున్నారు. మరొక్క అయిదారు రోజులు ఈ విధంగానే ఉండవచ్చును. కాని క్రమంగా తగ్గుతుంది. మరేం పర్వాలేదు" అన్నాను.

అనుకున్నట్లుగానే, కాదు, ఆశించినట్లుగానే ప్రమాదపు రోజులు గడిచిపోయాయి. రోగం తిరుగుముఖం పట్టింది.

ఆ రోజు ఉదయం ఆమె నన్ను విస్పష్టంగా గుర్తించిందనటానికి ఎట్టి సందేహమూ లేదు. ఆ కన్నుల కదలిక ఇప్పటికీ నాకు కన్ను మూసుకుంటే స్పష్టంగా కనిపిస్తుంది.

అదివరకు రోజుకి కొన్ని గంటలు ఆమె మంచం ప్రక్కనే కూర్చునే వాడిని, ఆ తరవాత ఏదో చిత్రమయిన మొగమాటాన్ని అనుభవించసాగాను.

రోజు రోజుకీ ఆమె పరిస్థితి బాగుపడుతున్నకొద్దీ, నేను కనే కలలు సంఖ్యకూడా అతిగా వృద్ధిపొంద సాగింది. కొన్ని పగటి కలలు, కొన్ని రాత్రి కలలు.

ఆమెను నేను పెళ్ళిచేసుకునేందుకు ఎన్నెన్నో అవాంతరాలు ఏర్పడి నట్లు, బాగా కావలసిన బంధుమిత్రులంతా వద్దని చెప్పినట్లు, ఇందరినీ అలక్ష్యంచేసి పెళ్ళిచేసుకున్నట్లు, ఆమె ఏదో కారణాలు చెప్పి తనకు ఇష్టం లేదంటే, ఎన్నో విధాల నచ్చజెప్పి చిట్టచివరకు ఒప్పించినట్లు ఇద్దరం కలిసి అలా ఒకరిచెయ్యి ఒకరు పట్టుకుని ఏ సాధనం లేకుండానే గాలిలో తేలిపోయి నట్లు, అలా అలా ఏవో అడవులూ, కొండలూ దాటి వెళ్ళిపోతుండగా అక స్మాత్తుగా ఒకరు ఏ అగాధమయిన లోయలో'నికో పడిపోతూంటే రెండవ వారు చేయూతనిచ్చి రక్షించినట్లు...ఓ ఒకటేమిటి, ఎన్నెన్ని రకాలుగానో కలలు.

అయితే కలలు రూపంగానయినా సంతోషం ఒక పది రోజులకంటె ఎక్కువ నిలవలేదు.

ఆవేళ ఉదయం నే నింటిదగ్గర లేనప్పుడు కబురు వచ్చిందట వ్యాధి తిరగబెట్టిందని. నేను తెలుసుకుని వెళ్ళేసరికి శ్యామలరావుగారు వచ్చి ఉన్నారు. ఆయన అట్టే ఆశ లేదంటూవున్నా, చిట్టచివరివరకూ అంత సమీ పంలోనే మృతి కాసుకుని ఉందని నే ననుకోలేకపోయాను. ఆ రాత్రి పద కొండు గంటలతో సమాప్తమయి పోయింది.

ఆ రాత్రేకాదు, తరువాత చాలా రాత్రులు నిద్ర సరిగా ఎరగను. అయితే ఆ రకంగా ఒకరితో చెప్పుకోలేకుండా విచారించడంవల్ల నా శరీ

రాన్ని చెరుపుకోవడంకంటె మరేమీ చేసేదిలేదన్న వ్యవహారిక జ్ఞానంతో, తరువాత మామూలుమనిషినయి పెళ్ళికి సిద్ధపడ్డాను.

అయితే ఇంతకీ చెప్పవచ్చేదేమిటంటే, తరవాత కొంతకాలం ఎంత ముఖ్యమయిన కేసులున్నా సరే, ఆ వీధిలోంచి వెళ్ళడం అంటేనే బాధగా ఉండేది. ఇటీవల ఎంత మొరటు దేరిపోయినా, ఆ యింటిని తేరిపారచూస్తే మాత్రం కళ్ళంట నీళ్ళు వచ్చేస్తాయి. ఇక లోపలికి వెళ్ళి ఆ డాబా అగదులూ చూస్తే బిగ్గరగా ఏడ్చేస్తానేమో!

“సరే ఇక నీ యిష్టం, మీ చెల్లెలు యిష్టం...తరువాత ఆలోచిద్దాము గాని, లే, పోయి ఏదైనా సినిమా చూసివద్దాం” అంటూ లేచాను కుర్చీలోంచి.